

జంగారెడ్డిగూడెంలో వర్షం



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం చిరు జల్లులతో ప్రారంభమైన వాన సుమారు ఒక గంటపాటు కురిసింది. ఒక వైపు వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు కొద్దిపాటి వర్షం కాస్త ఊరటనిచ్చింది. దీనికి తోడు ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడటంతో జనం సేదదీరారు.

ప్రా'ధాన్యం' ఇచ్చేనా..!



- ప్రారంభమైన ఖరీఫ్ వరి మాసూళ్లు
- రెండు జిల్లాల్లో దాదాపు 4 లక్షల ఎకరాల్లో వరిసాగు
- 9.95 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- తేమశాతం నిర్ధారణపై స్పష్టత కరువు
- వాహనాల ఏర్పాటుపై రైతులను వీడని ఆందోళన
- గోనె సంచుల ఏర్పాటు పూర్తి కానట్లు సమాచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం సేకరణపై అధికారులు మాటలకు.. చేతలకు పొంతన కన్పించడం లేదనే చర్చ నడుస్తోంది. గతంలో రైతులు ఎదుర్కొన్న తేమ శాతం నిర్ధారణలో తేడాలు, వాహనాల ఏర్పాటు, గోనె సంచుల సమస్యలపై ఇప్పటికీ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో ఖరీఫ్ ధాన్యం సేకరణలో మళ్లీ కష్టాలు తప్పవా అనే భయం రైతులను వెంటాడుతోంది. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. పశ్చిమలో 4.65 లక్షల టన్నులు, ఏలూరు జిల్లాలో 5.30 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికోసం ఏలూరు జిల్లాలో 394, పశ్చిమగోదావరి జిల్లాలో 314 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు సాగాయి. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది నియామకం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ వరకూ బాగానే ఉన్నప్పటికీ రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మాత్రం అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. గడిచిన రబీలో తేమశాతం నిర్ధారణపై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుభరోసా కేంద్రం అధికారులు తేమశాతం నిర్ధారించి అంతా బాగానే ఉందని చెప్పి ధాన్యం వాహనాల్లోకి ఎక్కించి మిల్లులకు పంపించేవారు. అయితే మిల్లర్లు మాత్రం తేమశాతంలో తేడా ఉందంటూ ధాన్యం దిగుమతి చేసుకోకుండా వాహనాల్లో నిలిపివేయడం జరిగింది. రైతులు మిల్లుల వద్దకు వెళ్లి మాట్లాడుకుని మిల్లర్ నిర్దేశించిన తేమశాతానికి సొమ్ము చెల్లిస్తే తప్ప ధాన్యం దిగుమతి చేసుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో రైతులు మిల్లర్లకు ఎదురు సొమ్ము చెల్లించడంపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. అయినప్పటికీ ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేకపోయింది. మిల్లర్లు అధికారుల మాట ఏమాత్రం వినేవారు కాదు. దీంతో రైతులు ధాన్యం వాహనాలతో రోడ్లపై ఆందోళనలు చేసిన ఘటనలూ ఉన్నాయి. ఆ సమస్యపై ప్రభుత్వం ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదో అర్థం కావడం లేదు. రైతుభరోసా కేంద్రం అధికారులు నిర్ధారించిన తేమశాతం ఫైనలా లేక మిల్లర్లు చెప్పేది ఫైనలా అనేది స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. రైతుభరోసా కేంద్రంలో తేమశాతం ఫైనల్ చేసిన దానిపై అధికారులు చెప్పాల్సి ఉంది. అలాకాకుండా ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఇబ్బందీ లేదంటూ ప్రకటనలు గుప్పించడం వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదనే చర్చ రైతుల్లో నడుస్తోంది. రైతులు ఎదుర్కొంటున్న మరో సమస్య వాహనాల ఏర్పాటు. ధాన్యం రాశులుగా చేసి పది, 15 రోజులు గడిచినా అధికారులు లారీలను ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో రైతులు నానా యాతన పడుతున్నారు. ఈసారి ధాన్యం తరలించే వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. లారీలను సకాలంలో పంపించేందుకు తీసుకుంటున్న చర్యలేంటీ అనేవి మాత్రం చెప్పని పరిస్థితి ఉంది. ఇక మరో ప్రధాన సమస్య గోనెసంచులు. ధాన్యం పట్టేందుకు కనీసం గోనెసంచులు కూడా అందించని పరిస్థితి గతంలో నెలకొంది. ఇచ్చిన సంచులు సైతం చిరిగినవి ఉంటున్నాయి. దీంతో రైతులు సంచుల గురించి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు మూడు కోట్ల సంచులు అవసరమని అంచనా వేశారు. ఇప్పటి వరకూ సంచుల ఏర్పాటు పూర్తి కాలేదని సమాచారం. సంచుల ఏర్పాటులో నిర్లక్ష్యం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే మరోసారి రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పవని చెప్పొచ్చు. ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యతిచ్చి ముందుగానే సమస్యలపై దృష్టి సారించకపోతే గతంలో మాదిరిగానే సమస్యలు పునరావృతమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. దీనిపై అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

జిల్లాలో ఓటర్లు 15,88,622 మంది

- పురుషులు 7,78,884, మహిళలు 8,09,615
- థర్డ్ జెండర్ ఓటర్లు 123
- ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల
- డిసెంబర్ 9 వరకూ అభ్యంతరాల స్వీకరణ: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్ఎస్ఆర్ -2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా జిల్లాలో 15,88,662 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 7,78,884 మంది, మహిళలు 8,09,615 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 123 మంది ఉన్నారన్నారు. ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు తెలియజేయాలన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా ఓటర్ జాబితాలో పేరు రాకపోయినా, వారి పేరు తొలగించినా ఆన్‌లైన్ ద్వారా కూడా క్లెయిమ్స్, అభ్యంతరాలు తెలియజేయవచ్చన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇఆర్ఒలు డ్రాఫ్ట్ పబ్లికేషన్లను విడుదల చేసి ప్రదర్శించాలన్నారు.

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
ఉంగుటూరు	2,01,349	99,621	1,01,725	3
దెందులూరు	2,21,301	1,08,241	1,13,052	8
ఏలూరు	2,23,438	1,06,653	1,16,774	41
పోలవరం	2,44,313	1,18,488	1,25,815	10
చింతలపూడి	2,65,876	1,31,767	1,34,065	44
నూజివీడు	2,33,195	1,15,665	1,17,519	11
కైకలూరు	1,99,150	98,449	1,00,695	6

వినతి అందగానే పరిశీలన ప్రారంభించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

కలిదిండి: జగనన్నకు చెబుదాం- స్పందన దరఖాస్తుపై చివరి తేదీ వరకు వేచిచూడకుండా దరఖాస్తు అందిన మొదటి రోజునే పరిశీలించాలని, దరఖాస్తుదారునికి సంతృప్తి కలిగే రీతిలో పరిష్కారం ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. 'జగనన్నకు చెబుదాం' జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో స్థానిక కళ్యాణి ఫంక్షన్ హాలులో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, అదనపు ఎస్‌పి భాస్కర్, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలితో కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలిదిండి మండలంలో స్పందన దరఖాస్తులను అధికారులు మరింత సమగ్రంగా విచారించి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్దేశించిన చివరి తేదీ వరకు వేచిచూడకుండా, దరఖాస్తు అందిన మొదటి తేదీ నుండే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుని, అవి రీఓపెన్ కాకుండా సాధ్యమైనంత త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పరిష్కార విధానం దరఖాస్తుదారునికి అసంతృప్తి కలిగే రీతిలో కాకుండా నిబంధనలు అనుసరించి పేదలకు ప్రభుత్వ సంక్షేమ లబ్ది కలిగే విధంగా పరిష్కరించాలన్నారు. మండలంలో స్పందనలో అందని 63 దరఖాస్తుల పరిష్కారంపై దరఖాస్తుదారులు సంతృప్తి చెందలేదని, మరికొన్ని రీఓపెన్ అయ్యాయని అన్నారు. స్పందన దరఖాస్తుల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులు మరింత దృష్టి కేంద్రీకరించి నాణ్యమైన పరిష్కారాన్ని చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ సరుకులు ఇంటివద్ద అందించడం లేదని, ఆక్రమణల తొలగింపు, పారిశుధ్యం తదితర సమస్యలపై దరఖాస్తులు అందుతున్నాయని, వీటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాధ్, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాస్, డిఎల్‌డిఒ రమణ, సర్పంచి మారుతీ ప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం ప్రజారక్షణ భేరి బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అసమానతలు లేని రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం విజయవాడలో నవంబర్ 15న సిపిఎం ఆధ్వర్యాన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. శుక్రవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ బ్రోచర్, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ వివిధ రంగాల మేధావులు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు, నిపుణులతో రాష్ట్రంలోని ప్రజల సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చలు నిర్వహించిందన్నారు. ఆ సందర్భంగా వచ్చిన అనేక అభిప్రాయాలను క్రోడీకరించి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నిర్దిష్టమైన ప్రజాప్రణాళికను సిపిఎం రూపొందించిందన్నారు. దాన్ని ప్రజలకు వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల నుండి బస్సు యాత్రలు చేపడుతున్నారన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విభజన చట్టంలోని హామీలు అమలు చేయలేదన్నారు. పైగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించి, ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలందరికీ ప్రభుత్వం విద్య, వైద్య సేవలు ఉచితంగా అందించాలని కోరారు. వ్యవసాయ రంగంలో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి, స్వామినాథన్ కమిషన్, జయతీ ఘోష్, రాధాకృష్ణ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న పరిశ్రమలకు సహకారం అందించి ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచి, కనీస కూలి రోజుకు రూ.600 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు పట్టణ ప్రాంతాల్లోనూ చూపాలన్నారు. ఒపిఎస్ అమలు చేయాలని, ప్రయివేటు ఉపాధ్యాయులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని కోరారు. కేంద్ర విద్యుత్ సంస్కరణల అమలు నిలిపివేయాలని, ప్రజలపై ఛార్జీల భారం తగ్గించాలన్నారు. గ్యాస్ సిలెండర్ రూ.400కు, పెట్రోల్, డీజిల్ లీటరు రూ.60కే ఇవ్వాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయాలని కోరారు. ఏలూరు జిల్లాలోకి నవంబర్ 5న బస్సు యాత్ర ప్రవేశిస్తుందని తెలిపారు. 6, 7 తేదీల్లో జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం, చింతలపూడి మీదుగా ఏలూరు చేరుకుంటుందని, ఆయా ప్రాంతాల్లో సభలు జరుగుతాయని వివరించారు. ఈ యాత్రకు ముగింపుగా నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, తెల్లం రామకృష్ణ, జి.రాజు, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, బి.సోమయ్య, జి.నరసింహారావు, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, టి.ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి సిఇఒగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా కెఎస్ఎస్.సుబ్బారావు శుక్రవారం జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. పెదపాడు ఎంపిడిఒగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై జెడ్‌పి డిప్యూటీ సిఇఒగా ఎస్.నిర్మలాజ్యోతి కూడా బాధ్యతలు చేపట్టారు. వీరిని ఛైర్‌పర్సన్ పద్మశ్రీ శాలువాతో సత్కరించారు.

కలెక్టర్‌ను కలిసిన సిఇఒ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిఇఒను అభినందించారు.



సంతకాలు సేకరిస్తున్న నేతలు

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి - నిడమర్రు

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన నిడమర్రు, భువనపల్లి గ్రామాల్లో శుక్రవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీలతోపాటు ప్రజలపై ఇతర భారాలు రద్దు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు-2020ను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వేపకాయల గోపాలం, సంకు త్రిమూర్తులు, కడప నాగబాబు పాల్గొన్నారు

కంప్యూటర్ శిక్షణను వినియోగించుకోవాలి



సర్టిఫికెట్లు అందిస్తున్న శ్యాంసుందర్

ప్రజాశక్తి - ఏలూరు

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏలూరు పరిసర ప్రాంతాల కాలేజీ విద్యార్థులు, పెద్దలు సద్వినియోగం చేసుకోవాలని డిఇఒ పి.శ్యాంసుందర్ అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ 26వ బ్యాచ్ వారికి సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం స్థానిక అన్నే భవనంలో జరిగింది. కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ ఎం.లక్ష్మి స్వాగతం పలకగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడివాడ నరసింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి పి.శ్యాంసుందర్ మాటాడుతూ 2019 నుండి కంప్యూటర్ ద్వారా శిక్షణ పొందిన వారు తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఉపాధి కల్పన కోసం చేసే ప్రయత్నాలకు తనకున్న పరిధిలో ప్రోత్సాహం కల్పిస్తామన్నారు. కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఇటీవల సెట్‌వెల్ వారు ఈ కంప్యూటర్ శిక్షణ కేంద్రానికి గుర్తింపు ఇచ్చారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఇతర కోర్సులు కూడా నేర్చుకోవాలని, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. ఇంగ్లీషు, లెక్కలు గ్రూప్-1, 2 అభ్యర్థుల కోసం కోసం పాటుపడే వారికి తోడ్పడేలా శిక్షణ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. 26వ బ్యాచ్‌గా కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డిఇఒ చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రదానం జరిగింది. అనంతరం తరఫున డిఇఒను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మేతర అజయ్‌బాబు, ఎస్.కస్తూరిరావు, జి.శారద మాట్లాడారు.

మందులు ఇవ్వట్లేదు.. పెన్షన్‌కు అర్హత లేదు

చేతులెత్తేసిన అధికారులు



డిజిటల్ అసిస్టెంట్‌కు వివరిస్తున్న ఆనందం

ప్రజాశక్తి - చాట్రాయి

నాకు ప్యాంక్రియాస్ గ్రంధి డామేజ్ అవ్వటం వల్ల జీవితాంతం మందులు వాడవలసి వస్తుందని, ఆ మందులకు నెలకు రూ.8 వేల వరకు ఖర్చు అవుతుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని చిన్నంపేట గ్రామానికి చెందిన కొమ్ము ఆనందం స్పందనకు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆనందం విలేకరులతో మాట్లాడుతూ అనారోగ్య సమస్య వల్ల పనిచేయలేక పోతున్నానని, కుటుంబం గడవటం లేదని, మందులు కూడా కొనుక్కోలేకపోతున్నానని నాకు పెన్షన్, మందులు ఇప్పించాలని ఈనెల 16న కలెక్టరేట్‌లో అర్జీ అందజేసినట్లు తెలిపారు. శుక్రవారం చిన్నంపేట సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ వి.రమేష్ సచివాలయానికి పిలిపించి మీ సమస్య పరిష్కారం అయినందుకు సంతృప్తి చెందుతున్నారా అని అడగారని, నా సమస్య పరిష్కారం కాలేదని, కనీసం మందులు కూడా ఇవ్వటం లేదని, పెన్షన్ కూడా అర్హత లేదని చాట్రాయి మెడికల్ ఆఫీసర్ చెప్పారని తమ గోడును తెలియజేశారు. ఈమేరకు రమేష్ మీరు అసంతృప్తిగా ఉన్నట్లు పై అధికారులకు పంపించాలని ఫింగర్ ప్రింట్ వేయించారని తెలిపారు. నాకు మందులు ఇప్పించి, నా ప్రాణాలు కాపాడాలని ఆనందం వేడుకొంటున్నారు.

అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్న బస్సులపై చర్యలు

జిల్లా రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న పలు బస్సులకు సంబంధించి రూ.3,05,420లు అపరాధ రుసుము, ట్యాక్స్, పెనాల్టీ విధించడమైందని జిల్లా రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి తెలిపారు. దసరా పండుగ సందర్భముగా ఈనెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రైవేటు వాహనములపై ప్రత్యేక తనిఖీలు రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు నిర్వహించాలని ఈనెల 13వ తేదీన సంబంధిత రవాణా శాఖ అధికారులు సిబ్బందిని ఆదేశించడమైనదన్నారు. ఈమేరకు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ఈనెల 18వ తేదీన 10 ప్రైవేటు బస్సులకు, 21వ తేదీన ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న 9 బస్సులకు అపరాధ రుసుము విధించామని తెలిపారు.

మెట్ట ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలి

కరువు మండలంగా గుర్తించాలి సిపిఎం మండల కమిటీ



వరి పొలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రగఢవరం పంచాయతీ పరిధిలో రైతులు ఎంతో ఖర్చు పెట్టి వేసుకున్న పంటలు వర్షాభావంతో నీరు లేక ఎండిపోయాయని సిపిఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ప్రగఢవరం పంచాయతీలో సిపిఎం జిల్లా కమిటీ పిలుపుమేరకు రైతాంగంతో కలిసి మండల కమిటీ ఎండిపోయిన పొలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన వరి పంట వేసిన రైతాంగం, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత రెండు నెలల నుంచి వర్షాలు పడక చెరువుల మీద ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతాంగం చెరువులలో నీరు కూడా అయిపోయి ఎండిపోయిన పరిస్థితిలో సుమారు రూ.20 వేల నుంచి రూ.25 వేల పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావం దెబ్బతో నీరు లేక ఎండిన పొలాలను చూసి రైతు గుండె భారం అవుతుందని తెలిపారు. అధికారులు నేటికీ కూడా క్షేత్రస్థాయిలో పొలాలలోకి వెళ్లి నష్టపోయిన పంటను నమోదు చేయకపోవడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి కనుమతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు వెంటనే అధికారులను పంపి మండలంలో ఎండిపోయిన వరి పొలాలు నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి నష్టపోయిన రైతు, కౌలు రైతులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సూర్య కుమార్, డి.సత్యనారాయణ, ఎండిపోయిన పొలాల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎపి సమగ్ర శిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావు

ఆగిరిపల్లి : విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలకు ప్రాధ్యానత్యను ఇవ్వాలని రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. క్రీడలు దేహ దారుఢ్యానికి, మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. మండల పరిధిలోని తోటపల్లి హీల్ స్కూల్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంతరాష్ట్ర సిబిఎస్ఇ అండర్-19 విభాగంలో యోగా, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించడంతో పాటు, జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.సత్య ప్రసాద్, సిఇఒ కె.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు: స్టార్టప్ ఇండియా పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి కమ్యూనిటీ నుంచి మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సంబంధిత లబ్ధిదారులను గుర్తించి వారికి ఆయా రంగాల్లో శిక్షణ అందించాలని, అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ స్టార్టప్ ఇండియా పథకం కింద అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకునేందుకు ఎస్‌సి, ఎస్‌టి కమ్యూనిటీల నుంచి మహిళా వ్యవస్థాపకులను ప్రోత్సహించేందుకు ఔత్సాహికుల లబ్ధిదారులను గుర్తించి వారికి పరిశ్రమల శాఖచే ఆయా రంగంలో శిక్షణ అందించి, వారితో సమగ్రమైన డాక్యుమెంటేషన్ తయారుచేసి, వాటిని సంబంధిత బ్యాంకర్లకు సమర్పించడంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో యువ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు వృత్తి నైపుణ్యం, తదితర అంశాలపై శిక్షణ అందించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 547 గ్రామ పంచాయతీల నుంచి 482 మంది యువతను గుర్తించడం జరిగిందన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ కింద వివిధ పరిశ్రమల ఏర్పాటుకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 180 దరఖాస్తులు రాగా వాటిలో 172 ఆమోదం పొందాయని మరో అయిదు నిర్ధిష్ట కాల పరిమితితో పరిశీలనలో ఉన్నాయన్నారు. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం కింద పెట్టుబడి రాయితీ, విద్యుత్ రాయితీ, సేల్స్ టాక్స్ రాయితీ కింద రూ.23.30 లక్షల రాయితీ సొమ్మును ఏడు మంది ఎంఎస్ఎమ్ పారిశ్రామికవేత్తలకు మంజూరు చేస్తూ సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం జె.నాగరాజా, డిప్యూటీ డైరెక్టర్ పి.ఏసుదాసు పాల్గొన్నారు.

ఓటర్ల వెరిఫికేషన్‌కు సహకరించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఇంటింటికి పర్యటిస్తూ ఓట్లు వెరిఫికేషన్ నిర్వహిస్తున్న అధికారులకు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సహకరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఇందుకోసం అవగాహన పెంపొందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్న ఓటర్ లిస్టును రాజకీయ నేతలు పరిశీలించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు.

ఇ-క్రాప్ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించిన ఇ-క్రాప్ బుకింగ్ రైతుల జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 29వ తేదీలోగా తెలియజేయాలని నూజివీడు ఎడిఎ విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని బోర్వంచ గ్రామంలోని రైతుభరోసా కేంద్రం వద్ద పూర్తి చేసిన రైతుల జాబితాను శుక్రవారం ప్రదర్శించారు. అభ్యంతరాలను పరిష్కరించి అనంతరం ఈనెల 30వ తేదీన తుది జాబితాను విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం చారిత్రాత్మకం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం చారిత్రాత్మకమైందని నూజివీడు ఎంపిపి ఆరేపల్లి శిరీష కొనియాడారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు తండాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేద ప్రజలందరూ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా, ఆరోగ్యంగా ఉండటమే లక్ష్యంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఇంకుడు గుంతలు ఏర్పాటు : ఎపిడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇంటి అవసరాలకు వాడే మురుగు నీటిని వృథాగా పోనివ్వకుండా కమ్యూనిటీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పి.రాజవరం, తాటియాకుల గూడెం పంచాయతీలలో ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి అవసరాలకు వాడే మురుగునీరు డ్రైనేజీల ద్వారా పోతుండడంతో, కాలువల్లోకి వెళ్లిన ప్రదేశాల్లో, కమ్యూనిటీ పరిధిలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలా చేయడం ద్వారా వృథా నీరు ఎక్కడ పడితే అక్కడ వుండకుండా ఇంకుడు గుంతలలోకి పోతుందని తెలిపారు. ఈ పథకానికి సంబంధించి ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించవలసిందిగా సూచించారు. ఆయన వెంట పంచాయతీ సర్పంచ్ సోయం కాంతమ్మ, వనమా రాంబాబు, కార్యదర్శులు వీరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మండవల్లి

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నిర్వహిస్తున్న పనుల వల్ల శనివారం విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ ఎఇ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి అభివృద్ధి పనులలో భాగంగా శనివారం రహదారి వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలను పునర్నిర్మించేందుకు మార్పులు జరుగుతున్నాయన్నారు. అందుచేత 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్‌ను పూర్తిస్థాయిలో నిలిపివేస్తున్నామన్నారు. దీంతో పెరికె గూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని మండవల్లి, పెరికె గూడెం, కానుకొల్లు, లింగాల, గన్నవరం, మొఖాస, కలవపూడి, సింగనపూడి, మూడు తలపాడు, కొర్లపాడు తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి విద్యుత్ సరఫరా యధావిధిగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ అంతరాయానికి ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

నేరాలు - ఘోరాలు

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

తిరువూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తి గాయాల పాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని హనుమంతుల గూడెం గ్రామం వద్ద చాట్రాయి మండలం కొత్తగూడానికి చెందిన గొడవర్తి మహేష్(29) స్కూటీపై తన కుమార్తెను బావులపాడు మండలం వీరపనేనిగూడెం హాస్టల్ తీసుకు వెళుతున్నాడు. ఈ క్రమములో వారిని ఆర్‌టిసి బస్సు ఢీకొంది. స్థానికులు వెంటనే స్పందించి మహేష్‌ను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో మహేష్‌కు గాయాలు కాగా చిన్నారి క్షేమంగా బయటపడింది.

తెలంగాణా మద్యం స్వాధీనం

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకుల గూడెం అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద తెలంగాణా నుంచి తెస్తున్న 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా దర్భగూడెం గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ తెలంగాణా నుంచి దర్భగూడెం గ్రామానికి మద్యం బాటిళ్లను బ్యాగ్‌లో పెట్టుకొని వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

భర్త వేధింపులే కారణం

ప్రజాశక్తి - టి.నరసాపురం

భర్త వేధింపులు తాళలేక మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన మోర్ల పావని(29)కి శివన్నారాయణతో 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. గత కొంతకాలంగా శివన్నారాయణ భార్యను మానసికంగా వేధించటంతో ఈనెల 23వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి సిరిబత్తుల రాజేశ్వరి ఫిర్యాదుతో ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాణాసంచా తయారీదారులు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

దీపావళి పండుగ రానున్న నేపథ్యంలో అక్రమంగా బాణాసంచా తయారు చేసే వారిపై జిల్లా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సిఐ రాజశేఖర్ తెలిపారు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని మేకల కబేల సెంటర్‌లో అక్రమంగా బాణాసంచా ఇద్దరు వ్యక్తులు తయారు చేస్తున్నారని సమాచారాన్ని పోలీసులు అందుకున్నారు. సమాచారం మేరకు మహమ్మద్ నజీర్ ఇంటిపై ఒకటో పట్టణ సిఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. వారు దాడి చేసిన సమయంలో సురేకారం(పొటాషియం నైట్రేట్) 50 కేజీలు, తారాజువ్వలు-200, దారాల కట్టలు-16, సిసింద్రీ మందు(బ్లాక్‌పౌడర్) 1/2 కేజీ, మరికొన్ని బాణాసంచా తయారీకి వినియోగించే సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మహమ్మద్ నజీర్, మహమ్మద్ బషీర్ అనే ఇద్దరు వ్యక్తులపై ఎక్స్‌ప్లజివ్ యాక్ట్ యాప్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు వన్ టౌన్ సిఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా బాణాసంచా తయారు చేయడం గాని, నిలువ ఉంచడం కానీ చేస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. తమ ప్రాంతంలో ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే వెంటనే డైలీ హండ్రెడ్‌కు గాని, వన్ టౌన్ సిఐకు గాని సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ దాడిలో వన్ టౌన్ ఎస్ఐ లక్ష్మణ్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధ్వానంగా రహదారులు

మరమ్మతులకు నోచుకోని వైనం
ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
పట్టించుకోని అధికారులు


గుంతలమయంతో అద్వానంగా ఉన్న చింతలపూడి - యర్రగుంటపల్లి రహదారి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ప్రధాన రహదారులు అద్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారులు సైతం దెబ్బతిని గోతులుగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీనికితోడు ఎత్తుపల్లాలుగా మారిన రోడ్లలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి సమయాల్లో రహదారుల్లో గుంతలను గుర్తించలేని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. 'ములిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన' రాత్రిపూట గుంతలను గుర్తించక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు ఎక్కితే చాలు అంతా దుమ్మే. కొంత దూరంలో ఏముందో కూడా కనబడని పరిస్థితి. ప్రయాణికులతో పాటు రోడ్డుకు సమీపంలోని ఇళ్లలో ఉంటున్నవారు సైతం దుమ్ముతో అనారోగ్యం పాలవుతున్నారు. రోడ్డు గుంతలు పడటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో చింతలపూడి నుంచి యర్రగుంటపల్లి వరకు, అల్లిపల్లి నుంచి మేడిశెట్టివారిగూడెం వరకు గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి వయా రాఘవపురం, గురుభట్లగూడెం వెళ్లే రహదారి దారుణమైన గుంతలతో ద్విచక్రవాహనదారులు వెళ్లటానికే ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాతచింతలపూడి మొదలు పోతునూరు వరకు అడుగడుగునా గుంతలతో ప్రయాణికులు నానా అవస్థలు అనుభవిస్తున్నారు. అదే విధంగా చింతలపూడి నుంచి యర్రగుంటపల్లి వెళ్లే రహదారి రోడ్డు ప్రయాణికులకు విరక్తి కల్గిస్తుంది. దుమ్ము, దూళితో వెనుక వెళ్లే ప్రయాణికులు అనారోగ్య పాలౌవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లిపల్లి నుంచి సీతానగరం వరకు రోడ్లన్నీ అదే పరిస్థితి నెలకొంది.

అద్వానంగా లింక్ రోడ్లు

మండలంలో లింక్ రోడ్లు అద్వాన్నంగా ఉన్నాయి. గత 30 సంవత్సరాల నుంచి రోడ్ల సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోయగూడెం వయా నామవరం, సీతానగరం రోడ్లన్నీ ఇదే దుస్థితి. గత ప్రభుత్వంలో రోడ్డు వేస్తారని ఆశించిన ఆ గ్రామ ప్రజలకు రోడ్డు వేయకపోవటంతో ఈ ప్రభుత్వంలో అయినా వేస్తారని బలమైన నమ్మకం పెట్టుకున్నారు. కానీ డిసెంబర్ నెలకి ఎలక్షన్ కోడ్ వస్తుందని అందరు అనుకుంటున్న సమయంలో ఆ రోడ్డు వేస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలనుంది. అదేవిధంగా బట్టువారిగూడెం నుంచి బాలవారిగూడెం, తెల్లేసోమవారం నుంచి ప్రగడవరం, ఊటసముద్రం లింక్ రోడ్లు దాదాపు అదే పరిస్థితి. ఆ ప్రభుత్వం, ఈ ప్రభుత్వం అనుకోవటమే కానీ రోడ్డు నిర్మాణం జరగటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలకు మరమ్మతులైనా చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

రోడ్ల మరమ్మతులకు ప్రణాళికలు సిద్ధం

మండల ఆర్‌అండ్‌బి ఎఇ సుందరరావు

చింతలపూడి - రావింకపాడు 8 కిలో మీటర్లు రూ.4.15 లక్షలు, చింతలపూడి - గురుభట్లగూడెం 7 కిలోమిటర్లు రూ.4.99 లక్షలు, కె.గోకవరం - ప్రగడవరం 8 కిలోమీటర్లు రూ.2.47 లక్షలు రోడ్డు నిర్మాణం కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి పై అధికారులకు పంపించిన్నట్లు తెలిపారు. అదేవిధంగా ఏలూరు మెడిశెట్టివారిపాలెం, చింతలపూడి, యర్రగుంటపల్లి 6 కిలోమీటర్ల వరకు రూ.3.50 లక్షలు మంజూరైందని, టెండర్ ప్రక్రియ పూర్తి అవ్వగానే రోడ్డు నిర్మాణం చేపడతామని ఆయన తెలిపారు.

అధికారులు దృష్టి సారించాలి

దీపక్, లాయర్, చింతలపూడి

మండలంలో రోడ్లు గుంతలతో ప్రజలకు ఇబ్బంది కల్గిస్తున్నాయి. కనీసం మరమ్మతులు చేపడితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. దుమ్ము, దూళితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి గుంతలను పూడ్చాలి.

108 కూడా రావడం లేదు

ఆది వేణు, శెట్టివారిగూడెం

చింతలపూడి వయా నామవరం, సీతానగరం రోడ్డు వేయమని, అత్యవసర సమయాల్లో 108 కూడా రావటం లేదని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిస్లారు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవటం లేదు. అధికారులు స్పందించాలి.

నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - టి.నరసాపురం

నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వేపై ప్రధానోపాధ్యాయులు అవగాహన కలిగి వుండాలని మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి తెలిపారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో నేషనల్ అఛీవ్ మెంట్ సర్వేపై శుక్రవారం ప్రధానోపాధ్యాయులకు శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎంపిక చేయబడిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు చదివే విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయడానికి నంబరు 3వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష విధివిధానాలు ప్రధానోపాధ్యాయులకు వివరించడంతో సమర్థవంతంగా విద్యార్థులు పరీక్ష రాయడానికి శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. ఇతర మండలాల నుంచి వచ్చిన సిబ్బంది పరీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారిణి ఎస్.కళ్యాణి, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదుపు క్రమం తప్పకుండా కట్టాలి : ఎపిఎం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రైతు ఉత్పత్తిదార్ల గ్రూపు(ఎఫ్‌పిజి) అధ్యక్షులు ప్రతి నెలా పొదుపు క్రమం తప్పకుండా కట్టే విధంగా చూడాలని, సమావేశాలను తీర్మాన పుస్తకంలో రాసుకోవాలని, దాని వలన సభ్యుల మధ్య పారదర్శకత పెరుగుతుందని ఆగిరిపల్లి వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం బి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆగిరిపల్లి వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో ఎఫ్‌పిజి గ్రూపు లీడర్ల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతి ద్వారా సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చునని ఎఒ పి.చెన్నారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఎం కోఆర్డినేటర్ అల్వాన్నారాణి, ఎఫ్‌పిజి సిసి లక్ష్మీ, వెలుగు సిసిలు వెంకటరత్నం, అరుణకుమారి, భాగ్యలక్ష్మీ, సిబ్బంది రజిత, రాంబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది కొరత.. ప్రజల అవస్థలు

వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా సిబ్బంది లేక అనారోగ్యంతో వచ్చిన పేదలు ఇబ్బంది పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా కమిటీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో ఎక్సరే డిపార్ట్‌మెంట్‌లో ఎక్సరేకి వచ్చిన రోగులు సిబ్బంది లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. సిబ్బంది చీటీలు, ఎక్సరే తీసేవారు ఒక్కరే ఉన్నారన్నారు. ఎక్సరే తీయించుకోడానికి వచ్చిన గర్భిణులు, మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కట్లు పడుతున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించు కోకపోవడం సిగ్గుచేటన్నారు. ఎక్కువ మంది రోగులు వున్నపుడు సిబ్బంది తక్కువగా ఉండటం, అధిక సమయం వేచి ఉండటం వల్ల బిపి డౌన్ అయ్యి, అనారోగ్యం పాలౌతున్నారన్నారు. వచ్చిన సమస్య ఒకటి అయితే ఇక్కడకు వచ్చాక అనేక సమస్యలతో పేదలు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, వైద్య సిబ్బంది రోగులను పట్టించుకోని వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చాలా మంది పేదలు, దళితులు, గిరిజనులు ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడం కష్టంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం పేదలందరికీ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది కొరత పరిష్కరించాలని కోరారు.

చేతి వృత్తిదారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రధానమంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకానికి రూ.50 వేల కోట్లు కేటాయించి చేతి వృత్తిదారులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా సమావేశంలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక ఆర్ఆర్ పేటలోని చేతి వృత్తిదారుల జిల్లా కార్యాలయంలో ఎపి గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి గొల్ల వెంకట కృష్ణారావు అధ్యక్షతన వృత్తిదారుల జిల్లా సమావేశం జరిగింది. ముందుగా గతనెల 3వ తేదీన అనారోగ్యంతో మృతి చెందిన ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు(71) మృతికి సమావేశంలో సంతాపం తెలియజేసి జోహార్లు అర్పించారు. పోలా మృతి రాష్ట్రంలో చేనేత కార్మిక ఉద్యమానికి తీరని లోటు అని సమావేశం భావించింది. అనంతరం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని చేతి వృత్తిదారులను ఆదుకుంటామని గత రెండు నెలల నుంచి ప్రచారం నిర్వహిస్తుందనీ, రాబోయే రెండు నెలలలో జరగబోవు ఐదు రాష్ట్రాల ఎన్నికలలో లబ్ధి పొందడానికి

సమన్వయ కమిటీ డిమాండ్

ప్రధానమంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకానికి రూ.13 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంటుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో ఐదు శాతం వడ్డీ వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమైన చర్యని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 10వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వృత్తిదారులతో సభలు, సమావేశాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించి నవంబర్ 30వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆదిశేషు తెలిపారు. ఈ కార్యక్రమాలలో జిల్లాలోని చేతివృత్తి దారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య గ్రంథాలయ నిర్వాహకులు కంది విశ్వనాథం, జిఎంపిఎస్ నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, గనిగంటి కోటేశ్వరరావు, ప్రజాశక్తి బుక్ హౌస్ నిర్వాహకులు హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి
వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఎంఎల్‌ఎ ఆళ్ల నాని


సమావేశంలో మాట్లాడతున్న ఎంఎల్ఎ నాని

ప్రజాశక్తి - ఏలూరు

అధికారం దక్కదనే అక్కసుతో వైసిపి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను క్షేత్రస్థాయిలో తిప్పి కొట్టాలని మాజీ ఉపముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు ఎంఎల్ఎ ఆళ్ల నాని వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. వైసిపి జిల్లా కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు ఆళ్ళ నాని అధ్యక్షతన ఏలూరులోని సారథి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. తొలుత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి ఎంపీలు మిథున్ రెడ్డి, కోటగిరి శ్రీధర్, ఎంఎల్ఎ ఆళ్ల నాని, పలువురు ఎంఎల్ఎలు పుష్పమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ళ పాలనలో పార్టీకి, ప్రజలకు అనుసంధానంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని, పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత ప్రాధాన్యత ఇచ్చి గౌరవించామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు పదవులతో పాటు అధికారంలో భాగస్వామ్యం కల్పించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఇదే ఒరవడి కొనసాగితే రాజకీయంగా తుడిచి పెట్టుకు పోతామనే భయంతో ప్రతి పక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వైసిపి ఆవిర్భావం నుంచి వెన్నంటి ఉన్న కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని, అందుకు అనుగుణంగా వైసిపి శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రాంతీయ సమన్వయ కర్త, ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను వేధించాయని, నేడు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దకు చేరువ చేశామని అన్నారు. అవ్వాతాతలు గతంలో పెన్షన్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడే దుస్థితి నుంచి నేడు ప్రతీ నెల మొదటి తేదీన నేరుగా వారి ఇంటికే వెళ్లి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. నాడు ప్రజాధనం టిడిని నేతల జేబుల్లోకి వెళితే నేడు నగదు బదిలీ ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లోకి వెళుతున్నాయన్నారు. గోదావరి జిల్లాల్లో వైసిపి పటిష్టంగా ఉందని, రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయ ఢంకా మోగిస్తామని తెలిపారు. 'వై ఏపి నీడ్స్ జగన్' అనే కార్యక్రమాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని, సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. వైసిపి కార్యకర్తల కష్టం వృథా కాదని, పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తను గుర్తించి, వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అనంతరం ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌సిలు కవురు శ్రీనివాస్, జయమంగళ వెంకటరమణ, వంకా రవీంద్రనాథ్, జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్‌ఎలు తలారి వెంకట్రావు, తెల్లం బాలరాజు, అబ్బయ్య చౌదరి, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, దూలం నాగేశ్వరావు, వీఆర్ ఎలిజా, పుప్పాల వాసుబాబు, మేయర్ షేక్ నూర్జహాన్ తదితరులు ప్రసంగించి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, మార్కెట్ యార్డుల ఛైర్మన్‌లు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ఆదేశాలనుసారం ముసునూరు ఎస్ఐ యం.కుటంబరావు ఆధ్వర్యంలో అమరువీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓపెన్‌హౌస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ఆయుధాలు పనిచేసే విధానం, కౌంటర్ ఫైల్ విధానం, పోలీస్ స్టేషన్ నందు నిర్వహించే కౌన్సెలింగ్ ఇలా పలు అంశాలతో కూడిన వివరాలు విద్యార్థులకు అవగాహన కల్పించారు.


ముసునూరులో విద్యార్థులకు అవగాహన..

ఆగిరిపల్లి : ఉన్నతాధికారుల ఆదేశానుసారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగరిపల్లి పోలీస్‌స్టేషన్ నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంటిబాబు ఆయుధాల పనితీరు, రిసెప్షన్ కౌంటర్, రికార్డ్ రూం, పోలీస్ స్టేషన్ నందు నిర్వహించే కౌన్సెలింగ్ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆగిరిపల్లిలో ఒపెన్ హౌస్ నిర్వహిస్తున్న ఎస్ఐ

లోకముడి దేవాలయాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - మండవల్లి

ఏకశిలా పదునెట్టాంబడి కలిగిన దేవాలయంగా కొనియాడబడుతున్న లోకముడి అయ్యప్ప స్వామి దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శుక్రవారం సందర్శించారు. కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి ఆయన అయ్యప్ప స్వామి మాలదారణలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలతో మాట్లాడారు. అనంతరం కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి కార్యాలయానికి వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో కైకలూరు ప్రధాన రహదారి మండవల్లి లోకముడి వద్ద ఉన్న ప్రముఖ అయ్యప్ప స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాన్ని క్రమశిక్షణతో, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం అయ్యప్ప స్వామి భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అప్పారావు గురుస్వామి తాను స్వయంగా రచించి ముద్రించిన పదవ పాటల పీఠికను ఆయనకు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ అనిల్ కుమార్(నాని), డీలర్ రాంబాబు, హరిబోల్, గురు స్వామి, పాలచర్ల శ్రీనివాస్ చౌదరి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గెజిట్ ప్రకారం ఆసీలు వసూలు చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో రోజూవారి, వారపుసంతలో గెజిట్ ప్రకారమే ఆసీలు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఈమేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారుల నుంచి అధిక ఆసీలు వసూలు చేస్తే గుత్తేదారుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధిక ధరలు వసూలు చేస్తే మున్సిపల్ ఆర్ఒ నరసింహారావు సెల్ నెంబరు 9390931862, ఆర్ఐ సుబ్బారావు సెల్ నెంబరు 9398432234 కు ఫిర్యాదు చేయాలని తెలియజేశారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ళ మండలం, కలవపూడి గ్రామం, డో.నెం. 5-86కు చెందిన ఎగ్గిర్సి కరుణమ్మ, భర్త: ఎగ్గిర్సి జాన్ అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **T0680644 గల పాస్‌పోర్టును** మా గ్రామం అయిన కలవపూడి నుండి భీమవరం పాస్‌పోర్టు ఆఫీసుకి వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

ఎగ్గిర్సి కరుణమ్మ
భర్త: ఎగ్గిర్సి జాన్, హరిజనపేట, కవలపూడి, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 90006 54886

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుగొండ మండలం, చినమల్లం గరువు, గ్రామానికి చెందిన బొక్కా మల్లికార్జునరావు ఒరిజినల్ **దాక్యుమెంట్ నెం.2205** చినమల్లం గ్రామం నుండి సిద్ధాంతం గ్రామం వైపు వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

బొక్కా మల్లికార్జునరావు
తండ్రి: సుబ్బారావు, ఇంటి నెంబర్: 2-143
చినమల్లం గ్రామం, పెనుగొండ మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా-534269
ఫోన్ నెంబర్:-9573469603

In The Court Of The Addl. Senior Civil Judge :: Eluru
E.P.No.66/2018, O.S.No.127/2016

Between:
Karumanchi Ravi Kumar (Died) ...D.H.R
Mulagaleti Subhadra and another
AND
Navanasi Venkata Appa Rao, S/o. Surya Rao, Badeti Vari Street, Eluru. ...J.D.R

వేలం ప్రకటన

పై నెంబరు గల ఇ.పి. గ్రంధములో ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖల ప్రోపర్టీని శ్రీ కోర్టు వారు **ది.20-11-2023వ తేదీ ఉ॥ 10:30 ని॥ల నుండి వేలం వేయబడును.** కావున ఆసక్తి కలవారు అనగా వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు ఒరిజినల్ మరియు జిరాక్సు, 1/4 వంతు అమౌంటుతో పై తెలిపిన కోర్టు ఎదుట హాజరు కావలెను.

SCHEDULE

323-4-0 Square Yards Equal to 268 Squar Meters in which Residential House is existed on the worth out of AC 4-08 Cts covered by R.S.No. 59/11 of Tangellamudi (V), Tangellamudi Panchayathi, Eluru (M), Eluru District, Eluru Sub Registrar within the following boundaries:

EAST: 24 Feet width road 42-0.
SOUTH: Site of Polegani Gopala Krishna 67-0.
WEST: Site of Kadiyala Chandrayya Etc., 44-9.
NORTH: Site of Bellemkonda Venkateswara Rao 67-0.

D.H.R. Value : Rs.3,21,000-00
Amina Value : Rs.40,30,000-00

ఏలూరు, 27-10-2023.
నెక్కరగంటి నరసింహారావు, అడ్వకేట్, ఏలూరు.

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు
ఆర్.ఓ.సి. నెం. 78/2021/ఇ1 ది.20-10-2023

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘము పరిధిలో నందు పురపాలక సంఘ నిధులతో పాలకొల్లు పురపాలక సంఘ నందు వీధి దీపముల రిపేర్లు మరియు నిర్వహణ కొరకు అవసరమగు ఎలక్ట్రిషియన్స్‌ను ఏర్పాటు చేయు నిమిత్తం (1 పనికి) గాను అంచనాలు విలువ సుమారు రూ. 4,99,950/- లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 27-10-2023 తేది ఉదయం 11.00 ని॥ల నుండి లభించును.

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- **బి.ఆర్.యస్.శేషాద్రి**
మునిసిపల్ కమిషనరు, పాలకొల్లు